సాక్షి
ములుగు

శుక్రవారం | 17 | నవంబర్ | 2023

ఎ'లక్షణం'గా సాగేందుకు..
- వివిధ స్థాయిల్లో ఎన్నికల అధికారుల విధులు
- బూత్ లెవెల్ నుంచి జిల్లాస్థాయి వరకు ఏర్పాటు

ఓటు..వదలనీయం..
- ఎన్నికల నిర్వహణలో బ్లాగ్ విధులు
- ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన

అభివృద్ధి చేసే పార్టీని ఆదరించండి..
- ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కూర్మాచలం

రూ. 19.67 లక్షల నగదు స్వాధీనం



- వివరాలు 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0°/19.0°

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ సాధారణంగా ఉంటుంది. రాత్రి పూట పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రూ.10వేల జరిమానా



జరిమాన స్లిప్పును చూపిస్తున్న సాయిరాం

గోవిందరావుపేట: పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జడ్జి రాం మోహన్‌రెడ్డి రూ.10వేల జరిమానా విధించినట్లు పస్రా ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. వారం క్రితం పస్రాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా చుక్క సాయిరాం మద్యం సేవించి లారీ నడుపుతూ పట్టుబడ్డాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేసి అతన్ని స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుచారు. దీంతో అతనికి జడ్జి రూ.10వేల జరిమాన విధించారు. ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దు



ములుగు: రాష్ట్ర ప్రజలు సీఎం కేసీఆర్ మాటలను నమ్మి మోసపోవద్దని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఈ మేరకు టీఎస్‌డీఎఫ్ తరపున జాగో(మేలుకో) తెలంగాణ, ప్రజాస్వామ్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల చైతన్య యాత్ర గురువారం జిల్లా కేంద్రానికి చేరుకోగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనకు మేడిగడ్డ బ్యారేజ్ నిలువుటద్దం అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దోపిడీ రాజకీయాలను ప్రజలు గమనించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు సేవ చేస్తుందన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఏ హామీని పక్కాగా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో అవినీతి, అబద్ధపు, అసత్య, నిరంకుశ, అహంకార పాలన కొనసాగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టడానికి గత నెల 27వ తేదీ నుంచి యాత్ర చేపట్టి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు వివరించారు. ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



భూపాలపల్లి రూరల్: విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి అన్నారు. గురువారం భూపాలపల్లి ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర శాస్త్రశాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 31వ జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 55 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు జిల్లా సైన్స్ అధికారి స్వామి తెలిపారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు.

గంగదేవిపల్లిని సందర్శించిన దేశవిదేశీ ప్రతినిధులు

గీసుకొండ : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని గురువారం ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, టర్కీతో పాటు దేశంలోని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు గురువారం సందర్శించారు. బాలవికాస ఆధ్వర్యంలో కమ్యూనిటీ డ్రివెన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రెండు వారాల పాటు శిక్షణ తీసుకున్న వారు ఫీల్డ్ స్టడీలో భాగంగా వారు గంగదేవిపల్లి అభివృద్ధిని పరిశీలించారు. బాలవికాస అసోసియేట్ కొట్టి రమాదేవి, జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి, రిసోర్స్‌పర్సన్ గూడ సరోజన వారికి గ్రామ అభివృద్ధిని వివరించారు.

యువ జపం!

నవ, యువ ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎమ్మెల్యే అభ్యర్థుల పాట్లు

- అసెంబ్లీ ఎన్నికల్లో కీలకంగా మారిన యువత
- వారి చేతిలోనే నేతల భవిత... ఎమ్మెల్యేలుగా గెలవాలంటే ఆ ఓట్లే కీలకం..
- గెలుపోటములు నిర్ణయించేది వీరే... 18–29 మధ్యన 7,05,286 మంది..
- 30 నుంచి 39 వయస్సుగల ఓటర్లు 7,65,172 మంది

సాక్షిప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ఎన్నికల పోరు ఉమ్మడి వరంగల్‌లో పతాకస్థాయికి చేరుకుంటోంది. వ్యూహాలు, ప్రతి వ్యూహాలతో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు. నామినేషన్ల ఉప సంహరణతో తర్వాత ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 213 మంది అభ్యర్థులుగా ఉన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 36 మంది 12 సెగ్మెంట్లలో పోటీ చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు అధికారంలోకి వస్తే ఏమి చేస్తామో చెబుతూ యువ, నవ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో అభ్యర్థులు పడరాని పాట్లు పడతున్నారు. ఉమ్మడి వరంగల్‌లో మొత్తం 29,74,631 మంది ఓటర్లుండగా.. 18 నుంచి 39 ఏళ్ల మధ్య వయస్సు వారు 14,70,458 మంది ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో యువ, నవ ఓటర్లు ఎవరి వైపు మొగ్గ చూపుతారన్న చర్చ రాజకీయ విశ్లేషకుల్లో సాగుతుండగా.. ఆ ఓటర్లను ఆకట్టుకోవడంపై ప్రధాన పార్టీలు దృష్టి పెట్టాయి.

యువతే కీలకం.. ప్రచారం సహా ఓటింగ్‌లోనూ ప్రభావం

ప్రశ్నించే గుణం, స్పందించే తత్వం కలిగిన యువత సహజంగానే ఎన్నికల్లో అత్యధికంగా ప్రభావితమవుతారు. ఎన్నికల తరుణంలో రాజకీయ చర్చలనుంచి మొదలుకొని అన్ని పార్టీల తరఫున ప్రచారం చేయడం, సాంకేతిక సహకారం అందించడం వరకు తమవంతుగా పాలుపంచుకుంటుండగా ఇటీవల ఓటు నమోదు, ఓటింగ్‌శాతం పెంచడం, సచ్ఛీలురను ఎన్నుకునేలా కార్యక్రమాలు సైతం చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో యువత అధికంగా ఉండడంతో యువచైతన్యం వెల్లివిరుస్తుండగా వచ్చే ఎన్నికల్లో వీరే కీలకంగా మారనున్నారు. అత్యధిక జనసాంద్రత కలిగిన ఓరుగల్లు జిల్లాలో విద్యానుకూల పరిస్థితులు చైతన్యానికి దోహదం చేస్తున్నాయి. జిల్లాలో కేయూసీ, ఎన్ఐటీ, హెల్త్ యూనివర్సిటీ, వెటర్నరీ, వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ డిగ్రీ, వ్యవసాయ పీజీ కళాశాలలు, పదుల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, వొకేషనల్ కళాశాలలుండటం, నిరుద్యోగ యువత అధికంగా ఉండడంతో పలు కళాశాలల్లో ఓటరు నమోదు కార్యక్రమాలు, న్యాక్ కేంద్రం, ఐటీఐ, ఇతరత్రా యువజన, స్వచ్ఛంద సంస్థలు తమవంతుగా ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. సోషల్ మీడియా ద్వారానూ వీరు ఓటరు చైతన్యం, ఓటు నమోదు, ఓటు వేయడం, పోలింగ్, పార్టీల పాత్ర తదితర చాలా అంశాలపై పెద్దఎత్తున స్పందిస్తున్నారు. వ్యక్తిగతంగా, గ్రూపులుగానూ సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండగా వీరిలో కొందరు పార్టీల ద్వారానూ ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు. యువత తాము నమ్మిన అంశాలను తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆచరింపజేస్తారు కాబట్టి ఓటింగ్ సరళిని మార్చడమనేది వారి చేతిలోనే ఉన్నందున ప్రస్తుత ఎన్నికల్లో ఆకట్టుకోవడంపై అన్ని రాజకీయ పార్టీలు ప్రధానంగా దృష్టి సారించాయి.



ఓటర్ల నమోదులో కీలకం.. యువ, నవ ఓటర్లు 14.70 లక్షలు...

ఈ నెల 10న ప్రకటించిన జాబితా ప్రకారం ఉమ్మడి వరంగల్‌లో ఓటర్ల సంఖ్య 29,74,631. ఇందులో వయస్సుల వారీగా చూస్తే యువ, నవ ఓటర్లు 14,70,458 మంది ఉన్నారు. అత్యధిక శాతం పోలయ్యే ఈ ఓటర్లు ఏ పార్టీవైపు మొగ్గ చూపుతారన్న అంశం ప్రధానంగా మారింది. ఓ వైపు రాజకీయ విశ్లేషకుల్లో ఇదే చర్చ జరుగుతుండగా.. ప్రధాన రాజకీయ పార్టీలు సైతం తమ తమ పార్టీల అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఈ ఓట్లపైనే ఫోకస్ పెడుతున్నాయి. అలాగే 40–49 ఏళ్ల వయస్సున్న ఓటర్లతో పాటు 50–59 ఏళ్ల లోపు వయసున్న వారిని తమవైపు తిప్పుకునేందుకు నియోజకవర్గాలు, మండలాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించి తాయిలాలు అందించేందుకు రంగం సిద్ధం చేశారు. అదే విధంగా 60 నుంచి 80 ప్లస్ వయస్సున్న ఓటర్లను పోలింగ్ కేంద్రాల వరకు తీసుకెళ్లి ఓటు వేయించే దిశగా వ్యూహరచనలో నిమగ్నమైన ప్రధాన పార్టీలు.. నవ, యువ ఓటర్లను ఆకట్టుకోవడంపైనే దృష్టి సారించడం చర్చనీయాంశం అవుతోంది.

వయస్సు వారీగా ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	18-19	20-29	30-39	40-49	50-59	60-69	70-79	80+	మొత్తం
జనగామ	7,757	49,640	58,221	45,686	34,495	23,639	13,156	4,514	2,37,108
స్టేషన్ ఘన్‌పూర్	7,535	50,132	65,031	46,693	36,087	24,671	14,339	4,667	2,49,155
పాలకుర్తి	9,933	52,488	56,045	50,682	37,274	25,124	14,850	5,094	2,51,490
డోర్నకల్	9,309	47,465	61,892	39,971	29,188	19,141	9,573	2,725	2,19,264
మహబూబాబాద్	10,279	56,037	67,840	48,512	34,570	21,234	10,994	3,876	2,53,342
నర్సంపేట	8,361	49,464	58,740	45,771	32,328	21,546	11,900	4,069	2,32,179
పరకాల	7,563	43,699	53,003	45,619	32,024	21,482	13,066	4,980	2,21,436
వరంగల్ పశ్చిమ	7,417	48,079	73,546	64,841	46,598	28,033	13,844	4,330	2,86,688
వరంగల్ తూర్పు	6,308	47,299	70,510	55,949	37,200	22,483	11,237	3,655	2,54,641
వర్ధన్నపేట	8,940	54,054	71,492	53,834	38,735	25,269	12,823	4,045	2,69,192
భూపాలపల్లి	9,191	56,781	66,048	56,761	41,950	25,487	12,775	4,640	2,73,633
ములుగు	7,838	49,517	62,804	43,416	31,441	19,034	9,342	2,974	2,26,366

ఓటరు స్లిప్ అందుకున్న కలెక్టర్



కలెక్టర్‌కు ఓటరు స్లిప్‌ను అందిస్తున్న బీఎల్‌ఓ

ములుగు: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఓటరు స్లిప్‌ను అందుకున్నారు. జిల్లా కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ 136లో ఓటు హక్కు కల్పించడంతో బీఎల్‌ఓ సుభద్ర, సూపర్‌వైజర్ తిరుపతి కలెక్టర్‌కు ఓటరు స్లిప్పును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ములుగు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఖరీఫ్‌లో పండించిన ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 17శాతం తేమ ఉన్న ధాన్యానికి ఎలాంటి ఆంక్షలు విధించకుండా మద్దతు ధర ఆధారంగా కొనుగోలు చేయాలన్నారు. మిల్లర్లు ఎలాంటి ఇబ్బందులు పెట్టినా వెంటనే తెలియజేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, షెడ్లు ఉండేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి అరవింద్‌రెడ్డి, డీఎం రాములు, డీఆర్డీఓ నాగపద్మజ, ఎంఈఏ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, రైస్ మిల్లుల అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పరకాలకు సీఎం.. వరంగల్‌కు రాహుల్

నేడు ప్రజాఆశీర్వాద సభలో ప్రసంగించనున్న కేసీఆర్
- నర్సంపేటలో రాహుల్‌గాంధీ భారీ బహిరంగ సభ, వరంగల్ తూర్పులో పాదయాత్ర, కార్నర్ మీటింగ్
- పోలీసుల పటిష్ట బందోబస్తు

పరకాల/వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఎం కేసీఆర్, ఏఐసీసీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ శుక్రవారం పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పరకాలలో నిర్వహించనున్న బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. పరకాల–రాజీపేట శివారులోని వెల్లంపల్లి రోడ్డులో గల 10 ఎకరాల భూమిలో సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి. లక్ష మంది సభకు వస్తారనే అంచనాతో స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పర్యవేక్షణలో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 4గంటలకు జరిగే సభకు సీఎం కేసీఆర్ చేరుకుంటారు. సభాస్థలికి 300 మీటర్ల దూరంలోనే హెలిపాడ్ ఏర్పాట్లు చేశారు.



సభాస్థలిని పరిశీలించిన సీపీ

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ సీఎం సభాస్థలితో పాటు హెలిపాడ్‌ను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. బందోబస్తు గురించి పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. 1 డీసీపీ, 4 ఏసీపీలు, 10 మంది సీఐలు, 20 మంది ఎస్ఐలతో సహా కానిస్టేబుల్స్, గ్రేహౌండ్ పోలీసులు మొత్తం 300 మందితో బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



సీఎం సభాస్థలి ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

నర్సంపేట, వరంగల్‌లో రాహుల్



ఏఐసీసీ నాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీ శుక్రవారం వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లా పినపాక నుంచి మధ్యాహ్నం 1.25 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి 1.55 గంటలకు నర్సంపేటకు చేరుకుంటారు. నర్సంపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు పాల్గొంటారు. మధ్యాహ్నం 3.10 గంటలకు నర్సంపేట నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 3.25 గంటలకు మామునూరులోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. 3.40 గంటలకు వాహనంలో వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి వరంగల్ చౌరస్తా మీదుగా పోచమ్మ మైదాన్ వరకు పాదయాత్ర నిర్వహిస్తారు. అక్కడ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడతారు. పాదయాత్ర, కార్నర్ మీటింగ్‌లో రాహుల్ సుమారు 80 నిమిషాలు గడపనున్నారు. ఎంజీఎం జంక్షన్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తారు. అనంతరం వాహనంలో మామునూరుకు చేరుకుని సాయంత్రం 5.15 గంటలకు హెలికాప్టర్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్తారని అధికారులు విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

అభ్యర్థుల ఖర్చులను నమోదు చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పోటీలో ఉన్న అభ్యర్థుల ఖర్చుల వివరాలను పకడ్బందీగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకుడు నవిన్ బన్సల్, పోలీస్ శాఖ తరపున పర్యవేక్షకుడు అంజన్ చక్రబోర్తి, ఎన్నికల పర్యవేక్షకుడు వాగీష్‌కుమార్‌సింగ్, ఎస్పీ గాష్ ఆలంతో కలిసి కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 11 మంది బరిలో నిలిచారని తెలిపారు. ప్రధాన పార్టీల గుర్తులతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులకు గుర్తులు ఖరారు చేశామన్నారు. ఎన్నికల ఖర్చులను పరిశీలకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని వివరించారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు అధికారులు జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 303 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటి పరిధిలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటరు స్లిప్పులను అందించి 100శాతం ఓటు నమోదు అయ్యేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఏజెంట్లు సెల్ తీసుకువచ్చే వీలులేదన్నారు. మైక్రో అబ్జర్వర్లు, ప్రిసైడింగ్ అధికారులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఏజెంట్లు 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆరు గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఖర్చుల వివరాలు అభ్యర్థుల ఖాతాల్లో జమచేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఎంసీఎంసీ, 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఎలక్షన్ డీటీలు, ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ వెంకయ్య

ఏటూరునాగారం: ఇంటి, ప్రభుత్వ కార్యాలయాల పన్నులు నూరుశాతం వసూలు చేయాలని డీపీఓ వెంకయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆరు మండలాల పంచాయతీ కార్యదర్శులతో డీపీఓ వెంకయ్య సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైట్ టు వే పోర్టల్‌లో మీ లాగిన్‌లో, ఆఫీసర్ లాగిన్‌లో ప్రతిరోజూ ఓపెన్ చేసి వచ్చిన అప్లికేషన్లు పరిశీలించి పంపాలన్నారు. మీ లాగిన్‌కి వచ్చిన అప్లికేషన్లు వచ్చిన నాటి నుంచి 7 రోజులు మాత్రమే అప్రోవర్, రిజక్ట్ ఉండదన్నారు. 7రోజుల తర్వాత కేవలం అప్రోల్ మాత్రమే చేయాల్సి ఉంటుందన్నారు. ఒక వేళ డిమాండ్‌తో అప్రోల్ అయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సీపీఆర్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ లాగిన్‌పై మీకు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ పనులు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఉన్న తాగునీటి సమస్య, వీధిలైట్లు, ఇంకుడు గుంతలు పనులు చేపట్టాలన్నారు. ఈ పంచాయతీలో ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్‌డేట్ చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎల్‌పీఓ నాగపూరి స్వరూప, శ్రీకాంత్, హన్మంతరావు, రామకృష్ణ, ఎంపీడీఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్

ఏటూరునాగారం: ఆదివాసీ చట్టాలపై రాజకీయ నాయకులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఆకుల వారిఘణపురంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హడావుడి మొదలైన నాటి నుంచి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు ఆదివాసీ చట్టాలపై, భారత రాజ్యాంగంపై ఎటువంటి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఉన్నత విద్యావంతులుగా చెప్పుకునే నాయకులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆదివాసీ చట్టాలను సవరిస్తామంటే ఊరుకునేది లేదన్నారు. రాజ్యాంగంపై కనీస అవగాహన లేని నాయకులకు చట్ట సభల్లో అడుగుపెట్టే అర్హత లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా కోర్టు ద్వారా కాలయాపన చేసే ప్రయత్నం చేస్తే హై కోర్టును ఆశ్రయించి పోడు భూములకు హక్కు పత్రాలు సాధించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోరం నాగేశ్వరరావు, పొదెం నాగేశ్వరరావు, కోరం మోహన్ రావు, పొదెం సాగర్, జోగ వేణు, అంజి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులను గోదావరి దాటించొద్దు



పలిమెల: గోదావరి తీరం వద్ద జాలర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

పలిమెల: కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులను గోదావరి దాటించొద్దని జాలర్లకు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఎన్నికల సందర్భంగా గోదావరి తీర గ్రామాలైన మండలంలోని నీలంపల్లి, దమ్మూరులోని పోలింగ్ కేంద్రాలు, ఫెర్రీ పాయింట్‌లను మహదేవపూర్ సీఐ కిరణ్, పలిమెల ఎస్సై తమాషారెడ్డి, సిబ్బందితో కలిసి ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గోదావరిలో చేపలు పట్టే జాలర్లు, గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. కొత్త, అనుమానాస్పద వ్యక్తులను గోదావరి దాటించవద్దన్నారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే తప్పకుండా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా అందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. మావోయిస్టులకు సహాయం చేయడం, ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, టీఎస్ఎస్‌పీ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

మల్హర్: ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లెంపల్లి గ్రామంలో పోలింగ్ బూతులను డీఎస్పీ గురువారం పరిశీలించారు. అనంతరం ఓటుహక్కుపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలంతా సహకరించాలన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రలోభాలకు గురికావవద్దని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలుగకుండా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం



108లో గర్భిణికి డెలివరీ చేసిన సిబ్బంది

ఏటూరునాగారం: మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన గర్భిణిని 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది సాధారణ ప్రసవం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన కేసరి సారమ్మకు బుధవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో అంబులెన్స్‌లో వాజేడు పీహెచ్‌సీకి తీసుకురాగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి రెఫర్ చేయగా తరలించారు. అక్కడి ప్రసూతి వైద్య నిపుణులు పరీక్షించి తనకి డయాబెటిస్ షుగర్ ఉండడంతో పాటు ఉమ్మనీరు పోయినందున మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించాలని చెప్పగా అంబులెన్స్ తరలిస్తున్నారు. ఈ క్రమంలో జవహర్ నగర్ గ్రామ సమీపానికి చేరుకోగానే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ శివలింగం ప్రసాద్, ఈఆర్‌సీపీ డాక్టర్ దుర్గాప్రసాద్ సూచనలతో వైద్యం అందించి సాధారణ ప్రసవం చేశారు.

వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న అరూరి రమేశ్



అవ్వా.. నీ ఓటు నాకే వేయాలి..

బీఆర్‌ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతనెక్కొండలో ఓ వృద్ధురాలి దగ్గరికి వెళ్లి 'అవ్వా.. నీ ఓటు నాకే వేయాలి' అని అభ్యర్థించారు.

– పర్వతగిరి

నీకైతే మిర్చి వేస్తా..నాకైతే ఓటెయ్యి

బీఆర్‌ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం మండలంలోని కోలుకొండలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ హోటల్ వద్ద మిర్చి చేసి ఓటు అభ్యర్థించారు.

–దేవరుప్పుల



కోలుకొండలో మిర్చివేస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

జంగ్ తెలంగాణ

దివ్యంగా రాట్నం తిప్పారు..

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తరఫున ఆయన కోడలు దివ్యా రెడ్డి గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత కార్మికుడి ఇంట్లో రాట్నం తిప్పుతూ, చేయి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

–జనగామ



జనగామలో రాట్నం తిప్పుతూ ప్రచారం చేస్తున్న దివ్య

ప్రచారం నిర్వహిస్తున్న కడియం కూతుళ్లు



తండ్రి తరఫున ముగ్గురు కూతుళ్లు..

బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి తరఫున ఆయన ముగ్గురు కూతుళ్లు కావ్య, దివ్య, రమ్య గురువారం మండలంలోని ఇప్పగూడెంలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు బొట్టు పెడుతూ నాన్నను గెలిపించాలని అభ్యర్థించారు.

–స్టేషన్‌ఘన్‌పూర్

ఓటు.. వదలనీయం..

ఎన్నికల నిర్వహణలో బ్లాగ్ విధులు
- ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన
- ప్రలోభాల కట్టడికి పకడ్బందీ చర్యలు

కాజీపేట: ఎన్నికలు సక్రమంగా జరగడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్‌లెవల్ అవేర్‌నెస్ గ్రూప్(బ్లాగ్)ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ, సెమీ ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి, స్థానిక ఓటర్లతో పరిచయం ఉండి, ఆ ప్రాంతంలో ఓటు హక్కు కలిగి ఉన్న స్థానిక వ్యక్తులను, ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఉన్న వారిని బ్లాగ్‌లో సభ్యులుగా నియమిస్తారు. ప్రతి బ్లాగ్‌లో బీఎల్వో బృంద సభ్యుడు నాయకుడిగా ఉండగా ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు, ఆశావర్కర్, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్, మహిళా సంఘాల బుక్ కీపర్లను సభ్యులుగా నియమిస్తూ ఎన్నికల అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వారందరికీ నియామక ఉత్తర్వులు జారీ చేయడమే గాకుండా విధి నిర్వహణలో అవగాహన కల్పించారు.


బ్లాగ్ బాధ్యతలు ఇలా..
- ఓటర్లకు అవగాహన కల్పించి చైతన్యపర్చడం, ఓటింగ్‌లో పాల్గొనేలా చేయడం.



- ఓటు హక్కును కలిగి ఉన్నవారంతా తమ ఓటు ను వినియోగించుకునేలా ప్రోత్సహించడం.
- మద్యం, డబ్బు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా వాల్‌పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేసి ఓటు ప్రాధాన్యత వివరించడం.
- ఎన్నికల్లో ఓటు ఆవశ్యకతపై పోలింగ్ బూత్ స్థాయిలోని పాఠశాలలో ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించడం వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం.
- గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, వృద్ధులకు ఓటింగ్ కోసం ఎన్నికల కమిషన్ కల్పిస్తున్న సౌకర్యాలు వివరించడం.
- దివ్యాంగులకు ర్యాంపు, ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించడం.
- వయోవృద్ధులు, పదవి విరమణ పొందిన అధికారులు ఓటింగ్ ఆవశ్యకతను తెలిపే ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం వంటి పనులు ఉంటాయి.

'నోటా'.. సెపరేట్ కోటా..

నర్సంపేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నర్సంపేట నియోజకవర్గంలో 16 మంది బరిలో నిలిచారు. ఈ నేపథ్యంలో ఒక్కో ఈవీఎంలో 16మందికే అవకాశం ఉంటుంది. ఇందులో అభ్యర్థులతో పాటు నోటాకు స్థానం ఉంటుంది. అయితే నర్సంపేటలో అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా ఈవీఎం ఉండగా నోటాకు స్థానం లేదు. దీంతో కేవలం



నోటా కోసమే ఒక ఈవీఎం ఏర్పాటు చేస్తున్నారు.

ఎ'లక్షణం'గా సాగేందుకు..

- వివిధ స్థాయిల్లో ఎన్నికల అధికారుల విధులు
- బూత్ లెవెల్ నుంచి జిల్లాస్థాయి వరకు..
- ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు చర్యలు



భూపాలపల్లి అర్బన్: ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రధానమైనది. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే ఎన్నికల్లో పౌరుడు తన ఓటు హక్కుతో నచ్చిన నేతను ప్రజాప్రతినిధిగా ఎన్నుకుంటాడు. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి నుంచి మొదలు.. గ్రామస్థాయిలోని పోలింగ్ బూత్ లెవెల్ అధికారి (బీఎల్వో) వరకు సమన్వయంతో విధులు నిర్వహిస్తేనే ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తవుతుంది. ఎక్కడ ఏ చిన్న లోపం ఏర్పడినా ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలుగుతుంది. బరిలో ఉన్న అభ్యర్థులు నామినేషన్ పత్రాల దాఖలు మొదలు... ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. తాజాగా తెలంగాణ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారులు వారి ఉన్నతాధికారులు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి ఎన్నికల అధికారి (కలెక్టర్) నుంచి.. బూత్ లెవెల్ అధికారి (బీఎల్వో) వరకు.. వివిధ స్థాయిలోని ఎన్నికల అధికారుల విధుల గురించి తెలుసుకుందాం..

జిల్లా ఎన్నికల అధికారి

జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. మిగతా ఎన్నికల నిర్వహణ అధికారులు కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. కిందిస్థాయి అధికారులకు విధులు కేటాయిస్తూ నిరంతరం సమీక్షలు జరుపుతారు. అధికారుల అందరికీ దిశానిర్దేశం చేస్తారు. జిల్లాస్థాయిలో కావాల్సిన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వాటిని పర్యవేక్షిస్తారు. ఓటరు జాబితా రూపకల్పన మొదలు.. ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి పూర్తయ్యే వరకు.. జిల్లా ఎన్నికల అధికారిదే పూర్తి బాధ్యత.

రిటర్నింగ్ అధికారి

రిటర్నింగ్ అధికారి నియోజకవర్గానికి ఒకరు ఉంటారు. వీరిని ఆయా నియోజకవర్గానికి సంబంధించిన శాసనసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల కమిషన్ నియమిస్తుంది. తమ పరిధిలోని ఎన్నికల ప్రక్రియను వీరు పర్యవేక్షిస్తారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి, వసతుల కల్పన, తదితర అంశాలు వీరి పరిధిలో ఉంటాయి.

సెక్టోరియల్ అధికారి

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడానికి సెక్టోరియల్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారు. ముఖ్యంగా పోలింగ్ బూత్‌ల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తారు. ఒక్కొక్కరి పరిధిలో దాదాపు 6 నుంచి 9 పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. వాటిలో ర్యాంపుల ఏర్పాటు, తాగునీటి వసతి, ఫర్నీచర్, విద్యుత్, లైట్లు, ఫ్యాన్లు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణ జరిగేలా చూస్తారు. తమ పరిధిలో జరిగే అంశాలకు వీరే బాధ్యత వహిస్తారు.

ప్రిసైడింగ్ అధికారి

ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో జరిగే అన్ని విషయాలకు అతడిదే సంపూర్ణ బాధ్యత. ఓటింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఇతర సామగ్రి తీసుకొస్తారు. పోలింగ్ అనంతరం ఎన్నికల సామగ్రిని తిరిగి నియోజకవర్గస్థాయి స్ట్రాంగ్ రూమ్‌కు చేరుస్తారు. వీరికి సహాయకంగా అదనపు ప్రోసీడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే కార్యకలాపాలన్నీ వీరి పర్యవేక్షణలోనే ఉంటాయి. ఎన్నికల సంఘం రూపొందించిన నియమావళికి అనుగుణంగా వీరు పనిచేస్తారు. వీరితోపాటు మరో ఇద్దరు పోలింగ్ అధికారులు పనిచేస్తారు. పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంల పనితీరు, ఇతర కార్యకలాపాలకు వీరిదే బాధ్యత.

ఓటు నమోదు అధికారులు

బూత్ స్థాయి అధికారులు అందించిన సమాచారంతో ఓటరు జాబితాను తయారు చేయడం వీరి ప్రధాన బాధ్యత. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు జాబితాలో పేర్లు సరిచేసుకునేవారు ఈ అధికారిని సంప్రదించాల్సి ఉంటుంది. తుది ఓటరు జాబితా రూపకల్పనలో వీరిదే ప్రధాన పాత్ర.

బూత్ లెవెల్ అధికారులు

ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో గ్రామస్థాయిలో పనిచేసే వారే బూత్ లెవెల్ అధికారులు(బీఎల్వోలు). గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన యువత, ఓటు హక్కుకు అర్హులైన వారిని ఓటు నమోదు చేసుకునేలా వీరు అవగాహన కల్పిస్తారు. కావాల్సిన దరఖాస్తులు వీరి వద్ద ఉంటాయి. పూర్తి చేసిన దరఖాస్తులను స్వీకరించి నమోదు చేసిన అనంతరం తుది జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల మార్పునకు సంబంధించి ఉన్నతాధికారులకు సహకరించడం వీరి ప్రధాన బాధ్యత.

కుట్టు మిషన్లు స్వాధీనం



ఫంక్షన్‌హాల్‌లో నిల్వచేసిన కుట్టుమిషన్లు

నడికూడ: పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారిపై మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీసీఎం తనిఖీ చేయగా అందులో సుమారు 50 వరకు కుట్టు మిషన్లు, అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధితో ఉన్న ఫ్లెక్సీతో పాటు, ఇతర సామగ్రి లభించాయి. దీనిపై డ్రైవర్‌ను వివరణ అడగగా పరకాల మండలంలోని వెలంపల్లి, పోచారం గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు పంపిణీ చేయడానికి మండలంలోని వరికోల్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో పోలీసులు కుట్టు మిషన్లు స్వాధీనం చేసుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించగా పరకాల ఆర్డీఓ కార్యాలయానికి తరలించారు. అలాగే, విశ్వసనీయ సమాచారం మేరకు వరికోల్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో సుమారు 460 వరకు కుట్టు మిషన్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో తాత్కాలికంగా ఫంక్షన్ హాల్ సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆయుర్వేద వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే

కాశిబుగ్గ: వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు బీఏఎంఎస్ రెండవ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సీనియర్, జూనియర్ విద్యార్థులు కలిసిమెలిసి ఉంటూ చదువుకోవాలని సూచించారు. అనంతరం, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైద్యశాల సూపరింటెండెంట్ జగన్మోనాచారి, ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు సాంబమూర్తి, రిటైర్ సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

రైల్వే సేఫ్టీ అధికారుల తనిఖీలు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లోని వివిధ విభాగాల్లో సికింద్రాబాద్ డివిజన్ రైల్వే సేఫ్టీ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. డ్రైవర్ల విశ్రాంతి కార్యాలయం, రన్నింగ్ రూం, రైల్వే చీఫ్ క్రూ కంట్రోల్ డ్రైవర్ల కార్యాలయం, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ (ఏఆర్‌టీ) బోగీలను తనిఖీ చేసి ఆయా విభాగాల అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అగ్గి రవీందర్, కాజీపేటకు చెందిన అన్ని విభాగాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రూ.19.67 లక్షల నగదు స్వాధీనం

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృత వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆధారం లేకుండా తరలిస్తున్న రూ. 19.67 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

మానుకోటలో రూ.9. 95 లక్షలు..

మహబూబాబాద్ రూరల్ : పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బుక్క బజార్ సమీపంలో గురువారం ఓ వ్యక్తి వద్ద రూ.9. 95 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. కేసముద్రం మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి ఆధారం లేకుండా తరలిస్తున్న ఈ నగదును పట్టుకుని సీజ్ చేశామని డీఎస్పీ తెలిపారు.

కేసముద్రంలో రూ.6 లక్షలు..

కేసముద్రం: మండల కేంద్రంలోని మార్కెట్ సమీపంలో కేసముద్రం విలేజీకి చెందిన వ్యాపారి సట్ల శ్రీను రూ.3 లక్షలు, కేసముద్రంస్టేషన్‌కు చెందిన మరోవ్యాపారి చిదురాల వసంతరావు వద్ద రూ.3లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఈ నగదుకు ఆధారం చూపకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఎల్కతుర్తిలో రూ. 2.32 లక్షలు..

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని బస్టాండ్ క్రాస్ వద్ద గురువారం ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.2.32 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు రాజ్‌కుమార్, సాయిబాబు తెలిపారు. సేల్స్‌మెన్ అజ్మీరా అశోక్ హనుమకొండ నుంచి హుజూరాబాద్ వైపునకు ఆటోలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆటోను తనిఖీ చేయగా నగదు లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని సీఐ తెలిపారు.



ఎల్కతుర్తి : వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

దోర్నకల్‌లో రూ.1.40 లక్షలు..

దోర్నకల్: దోర్నకల్ పట్టణ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద గురువారం రూ.1.40 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాారెపల్లి మండలం ఎర్రబోడు మాణిక్యారం గ్రామానికి చెందిన భూక్యా శోభన్ ఆధారం లేకుండా నగదును తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అభివృద్ధి చేసే పార్టీని ఆదరించండి..

- ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కూర్మాచలం

హన్మకొండ: అభివృద్ధి చేసే పార్టీని ఆదరించాలని బీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ అధ్యక్షుడు, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కూర్మాచలం అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలన్నారు. బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ ప్రధాన కార్యదర్శి కడుదుల రత్నాకర్, ఎన్‌ఆర్‌ఐ సెల్ అమెరికా నాయకురాలు బింధులత మాట్లాడుతూ దేశంలోనే రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్టు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి గొప్ప పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయాలన్నారు. సమావేశంలో ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు కోరబోయిన విజయ్ కుమార్, నవీన్ రెడ్డి, గొట్టిముక్కల సతీష్ రెడ్డి, శానబోయిన రాజ్ కుమార్, ప్రవీణ్ పంతులు, ఆకుల వినయ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అనిల్ కూర్మాచలం

దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: తెలుగు వెలుగు జాతీయ పురస్కారాలకు ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలుగు వెలుగు సాహితీవేదిక (టీవీఎస్‌వీ) జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, జాతీయ కన్వీనర్ డాక్టర్ వలబోజు మోహన్‌రావు, వరంగల్ సిటీ అధ్యక్షుడు డాక్టర్ పాడిశెట్టి విష్ణువర్ధన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. సాహిత్యం, రచన, కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం, భరతనాట్యం, కూచిపూడి, కోలాటం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, విద్య, వైద్యం, ఇంద్రజాలం,ముఖాభినయనం, హరికథ, ఒగ్గుకథ, బుర్రకథ, రంగస్థలం, జ్యోతిష్యశాస్త్రం, యోగా, డోలక్, హార్మోనియం, భజనరంగం, సామాజిక సేవారంగం, క్రీడలు, షార్ట్ ఫిలిం, క్రీడలు, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాప్రతినిధుల రంగాల్లో ఉన్నవారు పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. ఎంపికైన వారికి ఈఏడాది డిసెంబర్ 10న విజయవాడలో పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు 9100174351, 9441261585 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

జనగామ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా కేంద్రంలోని వడ్లకొండ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బచ్చన్నపేట మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఆముదాల సురేందర్‌రెడ్డి(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం జనగామ జిల్లా కేంద్రంలోని జ్యోతి నగర్‌లో కుటుంబంతో ఉంటున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయం, కుటుంబ అవసరాల నిమిత్తం అప్పు చేశారు. అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురైన సురేందర్ రెడ్డి గురువారం వడ్లకొండ సబ్ స్టేషన్ సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.



సురేందర్‌రెడ్డి (ఫైల్)

గీత కార్మికుడి మృతి

తొర్రూరు రూరల్ : తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని గోపాలగిరిలో జరిగింది. గ్రామానికి చెందిన ఎనమాల వెంకటపతి(53) రోజుమాదిరిగానే ఉదయం తాటిచెట్టు ఎక్కుతూ కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

దేశాయిపేట: డ్రగ్స్ నివారణలో ఎన్‌సీసీ కేడెట్లు ప్రధాన పాత్ర పోషించాలని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ సూచించారు. ఈమేరకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ సీకేఎం కళాశాలకు ఎన్‌సీసీ కేడెట్లు గురువారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శశిధర్ మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడి యువత తన ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్ లేని సమాజాన్ని నిర్మించడమే తమ లక్ష్యమన్నారు. వరంగల్ 10వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ కందూరి మాట్లాడుతూ డ్రగ్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల అనర్థాలు సంభవిస్తున్నాయని చెప్పారు. అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వివరించారు. కళాశాల నుంచి పోచమ్మమైదాన్ సర్కిల్ వరకు కేడెట్లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ సతీష్‌కుమార్, మోహన్, జీకే.కుమార్, రమేష్, శ్రీనివాస్, అరుణ, సుమలత పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేస్తోందని అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ మాతంగి శ్రీనివాస్ అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయ స్పోర్ట్స్ హాల్‌లో అసోసియేషన్ సమావేశం జరిగింది. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల నుంచి ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అసోసియేషన్‌కు సభ్యుల బాగోగులే ప్రధానమన్నారు. అసోసియేషన్ బలోపేతానికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు కృషి చేయాలన్నారు. అలాగే సంస్థ మనుగడకూ తమ వంతు కృషి చేయాలన్నారు. అసోసియేషన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి బక్క దానయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.ఉపేందర్, ఉపాధ్యక్షులు రామస్వామి, రౌతు రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాతంగి శ్రీనివాస్

కేడీసీకి అటానమస్ హోదాపై హర్షం

విద్యారణ్యపురి: ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద ప్రభుత్వ కళాశాలగా పేరొందిన, న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కలిగిన హనుమకొండలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల.. యూజీసీ నుంచి అటానమస్ హోదా పొందడంపై ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌ను జీసీజీటీఏ బాధ్యులు, ప్రభుత్వ పింగిళి కళాశాల, కేడీసీ యూనిట్ల బాధ్యులు గురువారం సన్మానించారు. అలాగే ఐక్యూఏసీ బృందం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జీసీజీటీఏ కాకతీయ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వెంకన్న, శిరీష, అశోక్, ఇందిరా, నైనాదేవి, పార్వతి, స్నేహలతరెడ్డి, సుహాసిని, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



రాజారెడ్డిని, రమేష్‌ను సన్మానిస్తున్న బాధ్యులు